క్లుప్తంగా

కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో బీరప్ప ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామంలోని పెద్దవాగు సమీపంలో కొలువు దీరిన జమ్మన్నతాత దేవాలయం వద్దకు భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ నిర్మలమ్మ, రామకృష్ణారెడ్డి, వైఎస్ఎంపీపీ దూల తిప్పయ్య ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు.

నేటి నుంచి కరాటే శిక్షణ

మరికల్: యువక మండలి ఆధ్వర్యంలో సోమవారం నుంచి మండల కేంద్రంలో ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రవి కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజుల పాటు సాగే శిక్షణ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 5 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంటి శిబిరం

మక్తల్: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రాంరెడ్డి కంటి ఆస్పత్రి నేతృత్వంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యోగా శిక్షణ

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలోని పతాంజలి యోగా సమితి కేంద్రంలో సోమవారం నుంచి 30 రోజుల పాటు యోగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు శిక్షకుడు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 వరకు యోగాసనాలు తదితర అంశాలను నేర్పించనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందిస్తామని వివరించారు.

ఆరాధన ఉత్సవాలు

మక్తల్: పట్టణంలో మోనేశ్వర ఆలయం వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య , భగవంతు, మోనేష్, బ్రహ్మయ్య, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంఈఓకు సన్మానం



మక్తల్: ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఎంఈఓ లక్ష్మీనారాయణకు జక్లేర్, మంతన్‌గోడ్, కర్ని సెక్టర్ పరిధిలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తన నిత్య జీవితంలో వృత్తిలో ఎలాంటి ఇబ్బందులు కాలేదని అందరి సహకారంతో తనవంతు కృషి చేశానని అన్నారు. మక్తల్, మాగనూర్, నర్వ, కృష్ణ మండలాలకు ఎంఈఓగా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. వెంకటయ్య, శ్రీనివాసులు, అనిల్‌గౌడ్, కిష్టప్ప, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి,భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసేవరకు పోరాటం



మక్తల్: ప్రభుత్వం జూనియర్ పంచాయతి కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడారు. తమ శ్రమను గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో రాజీ లేకుండా బాధ్యతలు నిర్వహించిన తమను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మధు, రవికుమార్, రాజ్యలక్ష్మి, జ్యోతి, అనిత, భగత్‌సింగ్, అనిత, నర్సిములు, సుమన్, బాలరాజు, కనకరాజు, కురుమూర్తి, శ్రావణి, శివయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు పునరుజ్జీవం

నారాయణపేట రూరల్ : చావుబతుకుల్లో ఉన్న ఓ గోవుకు యువత కష్టపడి పునరుజ్జీవం పోసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... జిల్లా కేంద్రంలో ఓ ఆవు మధ్యాహ్న సమయంలో విషపూరితమైన ఆహారం తినడంతో రాత్రి 8గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ సమీపంలో ఓ దుకాణం వద్ద కిందపడి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన అక్కడి వ్యాపారులు నీళ్లు తాగించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆవుకు సేవలు చేశారు. క్రమంగా కడుపు ఉబ్బుతుండటాన్ని గమనించి ఫోన్ చేయగా అక్కడికి చేరుకున్న పశువైద్య సిబ్బంది ప్రతాప్, దేవేందర్ అటుగా వెళ్తున్న మద్దూర్ వెటర్నరీ వైద్యుడు రాఘవేందర్‌గౌడ్ సాయంతో వైద్యం చేసి ప్రాణాలు కాపాడారు. పది గంటల సమయంలో ఆవు విషమ పరిస్థితి నుంచి బయటపడి లేచి పరిగెత్తింది. కాగా మరో ఐదు రోజులు వైద్య సేవలు అవసరం ఉండటంతో దానిని గుర్తించడానికి మెడకు ట్యాగ్ కట్టారు. ఆవును కాపాడేందుకు ప్రయత్నం చేసిన మీల గిరికాంబ్లే, శ్రవణ్, మణిమోదీలను స్థానికులు అభినందించారు.

నిర్వహణ అస్తవ్యస్తం

- నిరుపయోగంగా మారుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్లు
- వేధిస్తున్న ఆపరేటర్ల కొరత
- కన్మనూర్‌లో నత్తనడకన సాగుతున్న సబ్ స్టేషన్ పనులు



నత్తనడకన సాగుతున్న కన్మనూర్ సబ్‌స్టేషన్ పనులు

మరికల్: జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లలో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొందరు అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయి. దీంతో లోవోల్టేజీ సమస్య ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లాలో 2018లో కొత్తగా మరికల్, ధన్వాడ మండలాల్లోని వెంకటాపూర్, అప్పంపల్లి, గున్ముక్ల గ్రామాల్లో మూడు నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో స్టేషన్‌కు రూ.1.70 కోట్ల చొప్పున ఖర్చు చేశారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి అప్పటి ఎంపీ జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆపరేటర్లను నియమించి వెంటనే ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ నేటికి ఆపరేటర్ల నియామకం చేపట్టలేదు. ఒక్క వెంకటాపూర్ స్టేషన్‌కు మాత్రమే మూడు నెలల క్రితం ఆపరేటర్లను కేటాయించారు. దీంతో మిగతా సబ్‌స్టేషన్లకు మరికల్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండడంతో లోవోల్టేజీ సమస్య కొనసాగుతూనే ఉంది.

కన్మనూర్‌లో ముందుకు సాగని పనులు

కన్మనూర్ గ్రామంలో మూడేళ్ల నుంచి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు సాగుతూనే.. ఉన్నాయి. ఇప్పటికీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు రాకపోవడంతో విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నారు. ప్రస్తుతం ఎక్లాస్‌పూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కన్మనూర్ వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో లోవోల్టేజీ సమస్య వేధిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కింద 20 నుంచి 30 వరకు మోటార్లు ఉండటం వల్ల లోవోల్టేజీ సమస్యగా తీవ్రంగా మారిందని వాపోతున్నారు. తరచూ మోటార్లు కాలిపోతున్నాయని వాటి మరమ్మతుల కోసం చేసే ఖర్చు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రి సమయంలో పొలాల దగ్గరే పడిగాపులు కాస్తూ పంటలకు నీరు పెడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన చోట ఆపరేటర్లను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కన్మనూర్‌లో సబ్‌స్టేషన్ పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



సబ్‌స్టేషన్ల నిర్వహణ సరిగా లేకపోవడం, ఆపరేటర్ల కొరత వేధిస్తుండడంతో నిత్యం లోవోల్టేజీ సమస్య తలెత్తుతోంది. దీంతో తరచుగా ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు కాలిపోతున్నాయి. తప్పనిసరి అవుతుండడంతో రాత్రి సమయంలో పొలాల వద్దే పడిగాపులు కాస్తూ ఫీజులు సరిచేస్తూ పంటలకు నీరు పెడుతున్నాం. కన్మనూర్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలి.

– బాలప్ప, రైతు, కన్మనూర్

ఆపరేటర్లను నియమించాలి



సబ్‌స్టేషన్ ప్రారంభించి ఐదేళ్లు గడుస్తున్నా నేటికి ఆపరేటర్ల నియామకం చేపట్టలేదు. దీంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్లే నేటికి సమస్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికై నా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– తిరుపతిరెడ్డి, సర్పంచ్, అప్పంపల్లి

కొరత ఉంది

కొత్తగా ప్రారంభించిన సబ్‌స్టేషన్ల వద్ద ఆపరేటర్ల కొరత వేధిస్తోంది. నూతనంగా నియామకాలు చేపట్టాలన్న విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పదవీ విరమణ పొందిన సిబ్బందిని నియమించాలని ఆదేశాలు ఉన్నా వారు చేయడానికి ముందుకు రావడం లేదు. తాత్కాలిక ఆపరేటర్ల కోసం అన్వేషిస్తున్నాం. అదేవిధంగా కన్మనూర్‌లో సబ్‌స్టేషన్ పనులు పూర్తికావచ్చాయి. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు రావాల్సిఉంది. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తాం.

– రవికాంత్, ఏఈ, మరికల్

తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయండి

మరికల్: బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మే 7న జరిగే తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీనివాస్ అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం మరికల్‌లో ఆవిష్కరించారు. సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరుకానున్నట్లు తెలిపారు. ఆంజనేయులు, వెంకటేష్, చంద్రయ్య, రవి, గోవింద్, అశోక్, బాల్‌చందర్, నర్సింహులు, కృష్ణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లతో నాయకులు

జిల్లా వ్యాసాలకు ఆహ్వానం

నారాయణపేట టౌన్ : రాష్ట్రంలోని 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం ఇతర అంశాలపై హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ సమగ్ర గ్రంథాలను వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 11 జిల్లాల గ్రంథాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథానికి వివిధ అంశాల పై వ్యాసాలు ఆహ్వానిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వెంటనే జిల్లా కన్వీనర్ తాటి నర్సప్పను ఫోన్ నంబర్ 9110524534 లో సంప్రదించాలని ఆయన కోరారు.

‘మన్ కీ బాత్’ వీక్షించిన నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లాకేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో కార్యక్రమం వీక్షించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, మండల అధ్యక్షుడు రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు కొండన్ గోపాల్, అమీర్, ఎం నర్సింహులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: 'మన్ కీ బాత్' 100 ఎపిసోడ్‌ను బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు ఆదివారం వీక్షించారు. ఇందుకోసం మండల కేంద్రంలోని బస్‌స్టాండ్‌లో ప్రత్యేకం ఎల్‌ఈడీ టీవీని నాయకులు ఏర్పాటు చేశారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాంచంద్రయ్య, రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ నర్సిములు తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: మండల బీజేపీ నాయకులు స్థానిక సంజీవరాయ ఆలయంలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిలకించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సత్య యాదవ్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గోపాల్‌రావ్, మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నారాయణ, మాణిక్ పాల్గొన్నారు.



కార్యక్రమం తిలకిస్తున్న నాయకులు

మక్తల్: సంగంబండలో ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కౌన్సిలర్ ప్రసన్నరెడ్డి, కర్ని లక్ష్మి, మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



మక్తల్: నూతన సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా పాటుపడి ఉంటామని అన్నారు. మంత్రి నిరంజన్ రెడ్డిని కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

నర్వ: మండల కేంద్రంలో రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గవినోళ్ల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా వివేకవర్ధన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా హన్మంతురెడ్డి, ఉపాధ్యక్షులుగా రత్నాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సహాయకార్యదర్శిగా జగదీశ్వర్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నర్వ: గ్రామాల్లో ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నర్వ మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ అశోక్‌కుమార్, హోంగార్డ్ అనంత్‌రెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని నాటి సికిల్‌గేరి (పీహెచ్‌ఈఎస్) పాఠశాలలో 1998–99 లో టెన్త్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేస్, బాలప్ప, నర్సింహా, సుభాష్, శివ, షకీల్, అనూష, నాగేశ్వరీ, శ్రీదేవి, సుజాత, సోని పాల్గొన్నారు.

ఊట్కూర్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఊట్కూర్‌లో పదోతరగతి చదువుకున్న 1996–97 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులు గరిడి జనార్దన్‌రెడ్డి, కొల్లూర్ లింగారెడ్డిలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు సీఐ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కెంచె భాస్కర్, నారాయణ, మురళీధర్, యుగేందర్ గౌడ్, గోవింద్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల(2014) సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు తమకు పాఠాలు బోధించిన గురువులను శాలువాలతో సన్మానించారు. దాదాపు 200 మంది వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హారతి, రాజేశ్వరి, గాయత్రి, శిల్ప, స్వప్న, స్వాతి, శ్రీలత, రూప, శ్రీవాణి, తదితరులు ఉన్నారు.



మక్తల్‌లో వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పేటలో నాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



ఊట్కూర్‌లో..

రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

నారాయణపేట రూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండ, అప్పక్‌పల్లి, కొల్లంపల్లి గ్రామాల్లో ఆదివారం వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్నదాతలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. లాగోడి నుంచి పంట కొనుగోలుకు గిట్టుబాటు ధర అందించిందన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్, మార్కెట్ చైర్మన్లు డాక్టర్ నర్సింహారెడ్డి, జ్యోతి, బీఆర్ఎస్ అధ్యక్షుడు వేపూరిరాములు పాల్గొన్నారు.



కోటకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

భూమి చదును పనులు ప్రారంభం



పనులు ప్రారంభించిన సభ్యులు

దామరగిద్ద: ప్రభుత్వం ద్వారా పొందిన భూమిని సాగుయోగ్యంగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వ నిధులతో మూడో విడతగా జేసీబీతో చదును పనులను ఆదివారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో లక్ష్మీవేంకటేశ్వర రైతు సంఘం సభ్యులు ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నిర్మల కలెక్టర్ చొరవతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే నెంబర్ 22, 98, 111, 131లలో 61 మంది రైతులకు 122 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సీ రైతులకు ప్రభుత్వం భూమిని అందించారని వివరించారు. రైతు సంఘం అధ్యక్షుడు భీంషప్ప, కార్యదర్శి ఉషంతమ్మ, బుగ్గప్ప, బాల్‌చందర్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నారాయణపేట రూరల్ : నూతన సచివాలయం ప్రారంభానంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే ఫైల్‌పై తొలి సంతకం చేయడంపై జిల్లాలో పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు పాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, కృష్ణ, నర్సయ్య, ఉమాశంకర్, బస్సయ్య, మునిస్వామి, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ గజ్జలమ్మ దేవాలయానికి నర్వకు చెందిన డా.వెంకటేశ్వర్‌రావు విరాళం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జగన్‌మోహన్‌రెడ్డి, రామన్‌గౌడ్, వడ్ల నారాయణ, వెంకటేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

ధన్వాడ: మందిపల్లి గేట్ వద్ద ఉన్న బాలమ్మ దేవాలయ బ్రహోత్సవాలు ఈ నెల 4,, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బాలయ్య ఆదివారం తెలిపారు. ఈ మేరకు దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రాజప్ప, పూజారి నర్సిములు, బాల్‌రాజు, కుర్మన్న ఉన్నారు.

దళితబంధు ఇవ్వాలి

నర్వ: ప్రభుత్వం దళితబంధు పథకాన్ని వర్తింపచేయాలని దళిత జర్నలిస్టుల ఫోరం నాయకులు కోరారు. ఆదివారం నర్వలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్లన్‌కోటి శంకర్, ఉపాధ్యాక్షుడిగా ఆంజనేయులు, ప్రధానకార్యదర్శిగా శ్రీకాంత్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎన్నికయ్యారు. ఫోరం జిల్లా ఉపాధ్య క్షుడు శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను విజయవంతం చేయండి

మక్తల్: పట్టణంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఇతర నాయకులు మే డే పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈశ్వరయ్య, రాములు, గంగన్న, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండన్న, యూనియన్ నాయకులు బాలరాజు, మహబూబ్, తప్పమ్మ, సంధ్య, లక్ష్మి, భీమేష్, ఓబులమ్మ, జమ్ములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నిర్వహించే మేడే వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సిములు సూచించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక శివాజీ చౌరస్తాలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. దామోదర్, ప్రసాద్, శేఖర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



ర్యాలీ చేపట్టిన నాయకులు

కొనసాగుతున్న సమ్మె

మక్తల్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన వీఓఏల సమ్మె మండలంలో నిరవధికంగా సాగుతోంది. ఆదివారం సమ్మెలో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన వీఓఏల సమ్మె మండలంలో నిరవధికంగా సాగుతోంది. ఆదివారం 14వ రోజు మండల అధ్యక్షుడు పూంజనూర్ బాబు మాట్లాడుతూ.. వీఓఏల న్యాయపరమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. మండల కార్యదర్శి విష్ణు, కోశాధికారి రఘు, మారుతి, వరలక్ష్మి, మహేశ్వరమ్మ, రవి, వెంకటమ్మ, భాగ్యమ్మ, పావని, కరెప్ప తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత జయంతి



మరికల్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సింగార్‌బేస్, మండలంలోని కోటకొండ గ్రామ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సునీలేంద్ర, కార్యదర్శి అవినాష్, కోషాధికారి గిరీష్, మహిళ, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోస్గి: పట్టణంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయ సముదాయం ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనిత సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

మక్తల్: జక్లేర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సుజేంద్రశెట్టి, అరుణ, చంద్రశేఖర్, నరేందర్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వాసవీ మాత జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయం ఆవరణలో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు.

మద్దూరు: మండల కేంద్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు విజయ్‌కుమార్, కృష్ణయ్య, శ్రీనివాస్,రవికుమార్, జగన్నాథం, శోభరాణి, శైలజ, అరుణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో వాసవీ కన్యక పరమేశ్వరి పారాయణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు కావడంతో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోస్గిలో..



మద్దూర్‌లో దీపాలంకరణ



పేటలో దోలారోహణం